క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 16న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట ప్రశాంత్‌నగర్ ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, హనుమకొండ హంటర్‌రోడ్డులోని వాసవి కాలనీ, సిటిజన్ క్లబ్, మోక్ష విల్లాస్, న్యూశాయంపేట ప్రాంతంలో మధ్యాహ్నం1 నుంచి సాయంత్రం 4గంటల వరకు, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, వడ్డేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు, వెస్ట్ సిటీ సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు, రాంపూర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, టేకులగూడెం సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి 6గంటల వరకు, నయీంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

నేడు రక్తదాన శిబిరం

కాజీపేట రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రైల్వే ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కాజీపేట ఈఎల్ఎస్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించనున్నట్లు బ్రాంచీ సెక్రటరీ కుర్సపల్లి రవిందర్ తెలిపారు. ఈమేరకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో రైల్వే నాయకుడు కె.యాదవరెడ్డి, ఎఐజీడీఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, రైల్వే ఎస్సీ, ఎస్టీ నాయకులు బి.మాధవరావు, సంజీవ, విజయ్‌కుమార్, కిషన్, రాజలింగం పాల్గొన్నారు.

పద్మావతికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ విద్యావిభాగం పరిశోధకురాలు ఆర్.పద్మావతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఏ స్టడీ ఆఫ్ ది ఫ్యాక్టర్స్ ఇన్‌ఫ్లూయెన్సింగ్ ది ప్రొఫిసియెన్సీ అండ్ అకడమిక్ అచీవ్‌మెంట్ ఇన్ ఇంగ్లిష్ యాస్ ఏ థర్డ్ లాంగ్వేజ్ ఎట్ సెకండరీ లెవల్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పద్మావతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఘంటా రమేష్ పర్యవేక్షణలో పద్మావతి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. పద్మావతి ప్రస్తుతం హనుమకొండలోని ప్రభుత్వ మార్కజీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

'కవిత అరెస్ట్‌ను ఖండిస్తున్నాం'

కాజీపేట అర్బన్: ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వతంత్రంగా ఉండాల్సిన ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు సీబీఐ, ఈడీలు.. కేంద్రంలోని బీజేపీ సర్కారు కనుసన్నల్లో పని చేయడం దారుణమని పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుటిల రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు.

నియామకం

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా కుమ్మరి నీలక్కను నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు నియామక పత్రాన్ని ఆమెకు కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల రమ, కాంగ్రెస్ నాయకులు కుమ్మరి మొగిళి, ప్రసన్నలత, లక్ష్మి, కోమల, కవిత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఇంక్రిమెంట్లకు ఆమోదం

హన్మకొండ: గ్రామీణ తపాలా ఉద్యోగుల సీనియారిటీ ఇంక్రిమెంట్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.మహాదేవయ్య తెలిపారు. 12, 24, 36 ఏళ్ల సర్వీస్ కలిగిన గ్రామీణ తపాలా ఉద్యోగులకు ఈ నిర్ణయంతో జీతభత్యాలు పెరుగుతాయని చెప్పారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వానికి, కమ్యూనికేషన్ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలు, వృద్ధులను గౌరవించాలి

కాజీపేట రూరల్: సమాజంలో పిల్లలు చిన్ననాటి నుంచే పెద్దలను, వయోవృద్ధులను గౌరవించడం అలవర్చుకోవాలని హనుమకొండ జిల్లా సంక్షేమ శాఖ అధికారి మధురిమ అన్నారు. కాజీపేట డీజిల్ కాలనీలోని విజేత స్కూల్లో శుక్రవారం హెల్పేజ్ ఇండియా, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన గ్రాండ్ పేరెంట్స్ సెలబ్రేషన్ -విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో మధురిమ మాట్లాడుతూ.. కుటుంబాల్లో రోజురోజుకూ అనుబంధ బాంధవ్యాలు తగ్గిపోతున్నాయని, తల్లిదండ్రులు, తాత, నానమ్మ, అమ్మమ్మలతో చిన్నారులు గౌరవంగా మెలగాలన్నారు. స్కూల్ కరస్పాండెంట్ ప్రదీప్, ప్రిన్సిపాల్ కల్పన, సీడబ్ల్యూసీ మెంబర్లు దామోదర్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి యుగేందర్ పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

మామునూరు: వస్తువు కొనుగోలులో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ అన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో కన్స్యూమర్ కౌన్సిల్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి త్రిపురోజు రవికుమార్ అధ్యక్షతన విద్యార్థులతో ఇంటరాక్షన్ ప్రోగ్రాం, వినియోగదారుల హక్కులు, రక్షణ చట్టాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ చట్టం 1986, సవరణ చట్టం 2019 ద్వారా కల్పించిన 6 హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యవతి, మదన్ మోహన్, రేఖాదేవి, హారిక, సుప్రియ, రావుల రంజిత్, వినియోగదారుల హనుమకొండ అధ్యక్షుడు చిలగాని నరహరి, విద్యార్థులు పాల్గొన్నారు.



మామునూరు: మాట్లాడుతున్న సుదర్శన్



విద్యారణ్యపురి: మాట్లాడుతున్న సరళారుఫాన్సీ

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

విద్యారణ్యపురి: ప్రతీ వినియోగదారుడు తన హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వినియోగదారుల క్లబ్ కోఆర్డినేటర్, కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ సరళారుఫాన్సీ అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేడీసీలో వినియోగదారుల హక్కులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వస్తువు లేదా వివిధ సేవలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని చెప్పారు. కేడీసీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీధర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లమయ్య, కామర్స్ విభాగం అధిపతి డాక్టర్ వినోద్ రావు, వివిధ విభాగాల అధ్యాపకులు కమలాకర్, డాక్టర్ రాంరెడ్డి, లింగారెడ్డి, సుజాత, అయేషా, రాజీరు, నవీన్, బాలచందర్, సునీత పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



దర్గా స్కూల్‌లో మాట్లాడుతున్న రాధికాగుప్త

కాజీపేట రూరల్: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పదవ తరగతి పరీక్షలు రాయాలని అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా ఆకాంక్షించారు. మన బస్తీ – మన బడి కార్యక్రమంలో భాగంగా కాజీపేట దర్గా జాగీర్ ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం సందర్శించి అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అనంతరం హైస్కూల్‌ను సందర్శించి 10వ తరగతి విద్యార్థుల ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్‌లో జరుగుతున్న వీడ్కోలు కార్యక్రమంలో రాధికాగుప్తా పాల్గొని పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. హెడ్‌మాస్టర్ ఎస్ఎంఎం.స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్కూరి శ్రీనివాస్, సంతోష్‌కుమారి, సుమలత, సతీష్‌పాల్, సునీత, కె.శ్రీనివాస్, ఎ.మహేష్, అంబప్రసాద్, వరలక్ష్మి, స్టీఫెన్, మగ్బుల్ హుస్సేన్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ఇష్టపడి చదవాలి

కాజీపేట అర్బన్: లక్ష్య సాధనకు విద్యార్థులు ఇష్టపడి చదవి ఉన్నత స్థానానికి ఎదగాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్త సూచించారు. కాజీపేట కడిపికొండలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనాన్ని అందజేయాలని, పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సౌజన్య, ఆర్జేసీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో పరీక్ష ప్యాడ్ల పంపిణీ

కడిపికొండలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను అదనపు కలెక్టర్ రాధికాగుప్త అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు వెనిశెట్టి రఘు లావణ్య, గవర్నర్ గంప సాంబమూర్తి, గన్ను రామానుజం, మాదంశెట్టి సంపత్, కొడకండ్ల చంద్రశేఖర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

కాజీపేట: కాజీపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మన బస్తీ – మన బడి పథకం కింద కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్త తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, వంటశాలలను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై మహిళా ఏజెన్సీ సభ్యురాలు ఫర్వీన్ ఖాన్‌తో చర్చించారు. పాఠశాల హెచ్ఎం సంపత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారానికి కాన్షీరాం కృషి



కేయూ న్యూ పీజీ బాయ్స్ హాస్టల్‌లో కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్ఎఫ్ బాధ్యులు

కేయూ క్యాంపస్: బహుజన రాజ్యాధికారం కోసం ఎంతో కృషిచేసిన మొట్టమొదటి గొప్పవ్యక్తి మాన్య కాన్షీరాం అని బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ కల్లెపల్లి ప్రశాంత్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని న్యూపీజీ బాయ్స్ హాస్టల్ వద్ద కాన్షీరాం జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాంకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షుడు అజిత్, కార్య నిర్వాహక అధ్యక్షుడు చరణ్, కార్యదర్శి నవీన్, టీఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు చరణ్, పీజీ కళాశాల ఇన్‌చార్జ్ శివ, నాయకులు మారుతి, తిలక్, ధర్మేందర్, ప్రవీణ్, రవి, శివ, స్వామి, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేయూలో కాన్షీరాం జయంతి

కేయూ క్యాంపస్: మాన్య కాన్షీరాం జయంతి వేడుకలను కాకతీయ యూనివర్సిటీలో బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంద శ్యామ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌లో నాడు బహుజన రాజ్యాధికారాన్ని కాన్షీరాం తీసుకొచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఒంటేరు చక్రి, అధ్యక్షుడు ఎల్తూరి శ్రీనివాస్, స్వేరోస్ ఇంటర్నేషనల్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లా కిషన్, ఓబీసీ విద్యార్థి సంఘం జాతీయ కోఆర్డినేటర్ సాల్తీ కిరణ్‌గౌడ్, బహుజన విద్యార్థి సంఘం నాయకులు బండారి పృథ్వీరాజ్, దాసరి అఖిల్, కారం జగదీష్, రఘునాథ్, ఎనుముల సునీల్, మెరుపుల వేణు, ఆడెపు ప్రవీణ్, కుమ్మరి శ్రీనాథ్, పాడుగుల వివేక్, మంద నరేష్, మచ్చ పవన్, కార్తీక్, మధుగౌడ్, రత్నం, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపద పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కరీమాబాద్: చేపల పెంపకంపై ఆసక్తి ఉన్న వారు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ గణేష్, ములుగు జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ రమేష్ అన్నారు. శిక్షణలో భాగంగా మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న తెల్ల చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులపై శుక్రవారం అవగాహన కల్పించారు. చేపల చెరువుల ఏర్పాటు, శీతలీకరణ, ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు, చేపల చెరువులు తయారు చేసుకునే క్రమంలో చెరువు అడుగు భాగాన్ని ఎండబెట్టడం, నేలను దున్నడం వంటి వాటి గురించి వివరించారు. చెరువుల్లో సహజ ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి సేంద్రియ ఎరువుల మిశ్రమాన్ని తయారు చేసి చూపించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హన్మకొండ: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జరిగింది. లబ్ధిదారులకు రూ.3.60 కోట్ల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో హనుమకొండ తహసీల్దార్ విజయ్‌కుమార్, కాజీపేట తహసీల్దారు భావుసింగ్, కార్పొరేటర్లు నాయకులు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, మానస, మామిండ్ల రాజయ్య యాదవ్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

దర్గాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాజీపేట రూరల్: కాజీపేట దర్గాలో పలు నియోజకవర్గ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సర్తాజ్ బేగం, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, నాయకులు అమర్, సింగారపు రవిప్రసాద్, ఎం.కుమార్, ఎం.వేణు, బి.శ్రీను, లంకెలపల్లి శ్రీను, మైనార్టీ నాయకులు ఇంతియాజ్, హరిప్రసాద్, లంకెలపల్లి కృష్ణ పాల్గొన్నారు.

పెరిక కుల అభ్యున్నతికి కార్పొరేషన్



నినాదాలు చేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: పెరిక కుల అభ్యున్నతికి పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు గ్రేటర్ వరంగల్ పెరిక కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ వడ్డె రవీందర్ అన్నారు. పెరికల కుల కార్పొరేషన్‌ను స్వాగతిస్తూ సంఘం ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు శుక్రవారం పూలమాలలు వేసి మాట్లాడారు. కుల సంక్షేమానికి భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు. పెరికల కుల సంఘం నాయకుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ పెరికల కుల సంఘం అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పెరిక కుల సంఘం మాజీ సెక్రటరీ చింతం లక్ష్మీనారాయణ, బాధ్యులు రాధాకృష్ణ, బేరి వీరన్న, శ్రీరాం వీరయ్య, విజయ్‌కుమార్, బొల్ల వీరప్రతాప్, అప్పని సతీష్‌కుమార్, నాంద్రె అమర్, చిట్టిబొమ్మల భిక్షపతి, బెడిదే అనిల్, భాస్కర్, శంకర్, పోతురాజు రాజేశ్వర్, దొంగరి శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీ సీటుకు సీపీఐ పట్టు



న్యూశాయంపేట: వరంగల్ పార్లమెంట్ స్థానానికి సీపీఐ పట్టుబడుతోంది. ఈమేరకు ఢిల్లీలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాను పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు శుక్రవారం కలిశారు. ఇండియా కూటమి పొత్తుల్లో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కో సీటు ఇవ్వాలని కోరారు. ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలోని అజయ్‌భవన్‌లో జనరల్ సెక్రటరీ రాజా, సెంటర్ సెక్రటేరియల్ సభ్యులు రామకృష్ణ, పాండాను రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, నాయకులు చాడ వెంకటరెడ్డి, టి.శ్రీనివాస్‌రావు, విజయసారథి, బీఆర్ లెనిన్, తదితరులు కలిశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలంలో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలను సందర్శించి కనీస సౌకర్యాలను పరిశీలించారు. ప్రతి పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. హసన్‌పర్తిలోని జూనియర్ కళాశాలలో రెండు ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.80లక్షలు, ఎల్లాపురం స్కూల్‌లో ల్యాబ్‌కు రూ.13.50లక్షలు మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు అరుణకుమారి, సిరంగి సునీల్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు అమితారెడ్డి, రాణి, సుమలత, జోరిక పూల, శాంత, ఎంపీపీ సునీత, మదన్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, డివిజన్ అధ్యక్షుడు రఘు, ప్రేమ్‌కుమార్, గడ్డం శివరాంప్రసాద్, కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, అనిల్‌కుమార్, కుమార్, ఆకుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి పెద్దపీట



సీఎం, మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు

ఖిలా వరంగల్: ముదిరాజ్‌ల కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు కుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు సంగరబోయిన చందర్ అన్నారు. ఈమేరకు హర్షం వ్యక్తం చేస్తూ ఖిలా వరంగల్ తూర్పుకోట హనుమాన్ జంక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మేకల కుమారస్వామి, సిరబోయిన సారంగపాణి, సంగరబోయిన రాజ్‌కుమార్, మేకల కృష్ణ, జెటబోయిన వేణు, కిషోర్, అల్లం కేశవరాజు, సుధాకర్, రమేష్, గంగరబోయిన విజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, గ్రేటర్ వరంగల్ పెరిక కుల సంఘం గౌరవ అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ జేఏసీ రైల్వేగేట్ కన్వీనర్ దిడ్డి నరేందర్, అధ్యక్షుడు ప్రొఫెసర్ వడ్డె రవీందర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పెరిక ప్రతినిధులు చింతం లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, చింతం యాదగిరి, బేరె వీరన్న, శ్రీరాం వీరయ్య, విజయ్‌కుమార్, వీరప్రతాప్, అప్పని సతీష్‌కుమార్, నాంద్రే అమర్‌నాథ్, చిట్టి బొమ్మల భిక్షపతి, బెడిదే అనిల్, భాస్కర్, శంకర్, పోతురాజు, రాజేశ్వర్, దొంగరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఓటు ప్రాధాన్యంపై చైతన్యం కలిగించాలి

కరీమాబాద్: ఓటు హక్కు ప్రాధాన్యంపై ప్రజల్లో చైతన్యం కలిగించాలని నోడల్ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. త్వరలో జరగనున్న లోకసభ ఎన్నికల నేపథ్యంలో డీఆర్‌డీఓ కార్యాలయంలో 'స్వీప్'పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నియమావళి, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాలకు ఓటు హక్కు వినియోగంపై ఆర్‌పీలు, ఓబీలు వివరించాలని చెప్పారు. ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో బల్దియా టీపీఆర్ఓ కోలా రాజేష్‌కుమార్, డీఎంసీ రేణుక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.

బీసీల సమస్యల పరిష్కారానికి పోరాటం

ఖిలా వరంగల్: బీసీల సమస్యల పరిష్కారానికి పోరాడాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నిర్మాణ బాధ్యులు పంజాల రమేష్ పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులాల కార్పొరేషన్లకు బీసీలకు చెందిన నాయకులనే చైర్మన్లుగా నియమించాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాషుమియా, వెంకన్న, రవీందర్, దండు లక్ష్మణ్, బద్రి, ఎలేందర్, గోవర్ధన్, సువర్ణ, మల్లయ్య, అశోక్, లలిత, సతీష్, ఏకాంబ్రచారి పాల్గొన్నారు.

మల్లన్నకు ప్రత్యేక అలంకరణ

కాజీపేట: పట్టణంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో పండితులు వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణ పూజలు శుక్రవారం జరిపించారు. గంగానది నుంచి భక్తులు తెచ్చిన నది జలాలతో స్వామి వారికి సహస్ర ధారలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పండితులు మోదుగు పూలు, మల్లెలు, కనకాంబరాలతో మహాదేవుడిని అలంకరించారు. లింగాకారుడైన భోళాశంకరుడికి వెండి కవచం తొడిగి ధ్వజస్తంభం ముందు దీపార్చనలు చేసి పూజలు చేశారు.

కార్యకర్తలకు అభినందనలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగేలా శ్రమించిన ఆలయ కార్యకర్తలను ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఐనవోలు రాధాకృష్ణ శర్మ శుక్రవారం అభినందించారు. రెండు రోజులుగా శ్రమించి 29 దేవతామూర్తులకు సేవలు చేస్తూ సంతనాలింగేశ్వర స్వామి దర్శించుకోవడానికి విచ్చేసిన భక్తులకు ఇబ్బంది కలుగకుండా సహాయ, సహకారాలను కార్యకర్తలు అందించారు. వారందరికి ఆలయ ఈఓ సాయికృష్ణ శర్మ స్వామి వారి శేష వస్త్రాలు అందించి ఆశీర్వచనం చేశారు.

బాషబోయిన సంతోష్‌ను సస్పెండ్ చేయాలి

హన్మకొండ: ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్‌ను సంఘం నుంచి సస్పెండ్ చేయాలని దళిత, బహుజన విద్యార్థి సంఘాలైన టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, టీజేవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మధు మాదిగ, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, డీఎంఎస్ఏ జిల్లా కన్వీనర్ రేణుకుంట్ల ఠాగూర్ డిమాండ్ చేశారు. హనుమకొండ హరిత హోటల్‌లో దళిత బహుజన విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం సమావేశమై మాట్లాడారు. హసన్‌పర్తి భీమారంలోని బీసీ హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేస్తున్న రేణుకుంట్ల ప్రియాంకను భాషబోయిన సంతోష్ కులం పేరుతో దూషించి అవమానించి, డబ్బులు డిమాండ్ చేశారని అన్నారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు మచ్చ పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కాజీపేట రూరల్: తెలంగాణ స్టేట్ నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ డ్రామా మోనో యాక్షన్ పోటీల్లో కాజీపేట బాపూజీనగర్ కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని స్కూల్ యాజమాన్యం తెలిపింది. ప్లాస్టిక్ వాడకం, దాని ప్రత్యామ్నాయ గురించి డ్రామా ప్రదర్శించగా వరంగల్ డీఈఓ వాసంతి తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శిరీష, గైడ్ టీచర్ విజయ, విద్యార్థులు శ్రుతి, నిస్సి, మోక్ష, మన్విత్, రుత్విక్‌తేజ పాల్గొన్నారు.

దాడి కేసులో ఐదుగురిపై కేసు

ఖిలా వరంగల్: మహర్షి ప్రాజెక్ట్ ద్వారా మహర్షి ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో జరిగిన లావాదేవీలపై చర్చిద్దామని పిలిపించి దుర్భాషలు ఆడి దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. 2015లో చెంచు మధుసూదన్, గుండబోయిన వెంకన్న, వెంకటేశ్వర్లు, దొమ్మటి శ్రీనివాసులు.. మహర్షి ప్రాజెక్ట్ పేరుతో ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. ప్రతిఒక్కరూ రూ.5లక్షల చొప్పున పెట్టుబడి పెట్టారు. శ్యామ్‌నాయక్ మధ్యవర్తి ద్వారా ఆర్థిక లావాదేవీల గురించి ఓసిటీలో మాట్లాడుకుందామని హైదరాబాద్‌కు చెందిన చుంచు మధుసూదన్, అతని కుటుంబ సభ్యులను శుక్రవారం పిలిపించి దుర్భాషలాడి దాడి చేశారు. దాంతో బాధితుడు మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

పద్మశాలి కార్పొరేషన్‌పై హర్షం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

మడికొండ: పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మడికొండలోని పద్మశాలి సంఘం భవనంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు నామని కుమారస్వామి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షుడు కామిని మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం గొప్పవిషయం అని కొనియాడారు. కార్యక్రమంలో బిల్ల రవీందర్, కన్నె మల్లేశం, పోతరాజు ప్రకాష్, పొట్లబత్తిని లక్ష్మణ్, సారంగపాణి, చిదురాల వెంకటేశ్వర్లు, తోట భిక్షపతి, నల్ల రాజు, పెంట రాజు, అంకం భిక్షపతి, నల్ల వీరస్వామి, కూరపాటి మార్కండేయ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయొద్దు



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

హన్మకొండ అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు మే నెలలో పూర్తిగా సెలవులు మంజూరు చేయాలని, 24 రోజుల సమ్మె హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శోభారాణి, పి.రమాదేవి, జమున, తిరుమల, బేబిరాణి, వసంత పాల్గొన్నారు.

పైడిపల్లిలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం



వరంగల్: గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జక్కుల లావణ్య ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ విశ్వజ మాట్లాడుతూ పోషకాహారం, చిరుధాన్యాలు, పరిసరాల పరిశుభ్రత, సమతుల ఆహారం గురించి గర్భిణులు, బాలింతలకు వివరించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పిల్లల తల్లులు, మహిళలు పాల్గొన్నారు.